క్లుప్తంగా

ఎస్ఎస్‌జీఎస్ కళాశాల అధ్యాపకుడికి అవార్డు


అవార్డును అందుకుంటున్న అధ్యాపకుడు బసెట్టి క్రిష్ణయ్య

గుంతకల్లు రూరల్: స్థానిక శంకరానందగిరీ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బెసెట్టి క్రిష్ణయ్య స్ఫూర్తి శిఖరం అవార్డును అందుకున్నారు. ఆర్యాణీ సకలకళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న నిష్ణాతులను, ప్రముఖలను ప్రోత్సహిస్తూ స్ఫూర్తి శిఖరం అవార్డుల ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యా, సాహితీ, సేవారంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న అధ్యాపకుడు బసెట్టి కృష్ణయ్యను జాతీయస్థాయి స్ఫూర్తి శిఖరం అవార్డుతో సత్కరించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు, కళాశాల అధ్యాపకులు, కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపల్ గోపాల్, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

బాలిక అదృశ్యం

పెద్దవడుగూరు: పి.వీరన్నపల్లిలో అర్చన అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం కొత్త దుస్తులు తెచ్చుకోవడం కోసం బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి


ప్రదక్షిణ చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి

గుంతకల్లు రూరల్: హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామీజీ సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. హనుమద్ వ్రతం ఉత్సవాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని బెల్దోణ సత్రంలో బెల్దోణ రామనాథ శాస్త్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏటా దత్త జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు ఆశీర్వచనాలను అందజేశారు.

రోడ్డు నిర్మాణానికి నేడు భూమిపూజ

శింగనమల: శింగనమలలో పాత మరువకొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రూ.కోటితో తలపెట్టిన డబుల్ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భూమి పూజ చేయనున్నారు. ఈమేరకు సర్పంచు నాగమునెమ్మ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శింగనమలలో డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

జెడ్పీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ


జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: జెడ్పీటీసీ సభ్యులు ఆవులాంపల్లి భాస్కరరెడ్డిని సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు కిందకి పడటంతో కాలు విరిగింది. శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

లావణ్యకు సన్మానం


లావణ్యను సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల: నార్పల మండలం నాయనపల్లికి చెందిన శ్రీరాములు కుమార్తె లావణ్య ఎస్ఐ ఉద్యోగం సాధించిన విషయం తెలిసిందే. శ్రీరాములు మిత్రులు లావణ్యను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు టీచరు వెంకటేష్, రిటైర్డు ఉద్యోగి వన్నూరప్ప, రికార్డు అసిస్టెంట్ బాబుప్రసాద్, ఏపీఎంలు నారాయణస్వామి, చిన్న వెంకటప్ప టీచర్లు శివయ్య, సంజప్ప,పెద్దన్న, సూరి, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మయ్య, నాగన్న, అంజి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం



తాడిపత్రి ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న చర్చి ఫాదర్, గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న అద్భుత్‌కుమార్, మణికుమారి


బైబిల్ మిషన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలకు హాజరైన భక్తులు

- ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

గుత్తి: ఏసయ్య బోధనలు సర్వ మానవాళిని సన్మార్గంలో నడిపిస్తున్నాయని గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలోని మాజీ బిషప్ ఫెడరిక్ కుమారుడు, ఎంఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ రస్సెల్ కిరణ్ ఇంటిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమ, కరుణ పదాలకు పర్యాయపదం ఏసు ప్రభువన్నారు. తదనంతరం ఎమ్మెల్యేను క్రైస్తవులు శాలువాతో సన్మానించారు. రస్సెల్ కిరణ్ కుటుంబ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్ కృపా సుజాత, ఎంఎస్ డిగ్రీ కాలేజీ ఓఎస్ కిరణ్ బింగి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసయ్య ప్రేమ, కరుణకు ప్రతిరూపం

ఏసు ప్రభువు ప్రేమ, కరుణ కు ప్రతిరూపమని గుత్తి బైబిల్ మిషన్(స్వస్థత శాల) చర్చి పాస్టర్లు రెవరెండ్ అద్భుత్‌కుమార్, మణికుమారి దంపతులు అన్నారు. బైబిల్ మిషన్ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అద్భుతకుమార్, మణికుమారి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏసయ్యను ప్రార్థిస్తే నష్టాలు, కష్టాలు మటుమాయమై అన్నీ శుభాలే జరుగుతాయన్నారు. ఇదిలా ఉండగా గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు అత్యంత ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని సీఎస్ఐ టౌన్ చర్చి లో పాస్టర్ రెవరెండ్ సాల్మోన్, ఆర్ఎస్‌లోని సీఎస్ఐ చర్చిలో పాస్టర్ బీవీ మోహన్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరు. చిన్నవడుగూరు, దిమ్మగుడి, రావులుడికి, క్రిష్టిపాడు, గుత్తి అనంతపురం తదితర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. క్రీస్తు పుట్టుకను ఫాస్టర్ జాన్‌డేవిడ్, జాన్‌పాల్ వివరించారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్, సంజన, శోభారాణి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆర్సీఎం చర్చి, సుంకులమ్మపాలెంలోని క్రీస్తురాజు చర్చిలలో ఫాదర్ డేవిడ్, అరులప్ప ఆధ్వర్యంలో సోమవారం క్రీస్తు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దివ్యవాణి టీవీ ఛానల్ కోఆర్డినేటర్ ఫాదర్ రవిచంద్ర ప్రసంగించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఫాదర్ సెల్వ రాజ్, డికన్ మనోహర్, బ్రదర్ బి. వినోద్, నిర్మల సిస్టర్స్, జీవనాలయం సిస్టర్స్ పాల్గొన్నారు. సుంకులమ్మపాలెంలోని క్రీస్తు రాజు చర్చిలోఓ ఫాదర్ డేవిడ్ అర్లప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రైస్తవులకు పంపిణీ చేశారు. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక వద్ద బాల యేసుని ప్రతిష్ఠించారు. సుంకులమ్మ పాలెంలోని సెయింట్‌జాన్స్ చర్చి, నందలపాడులోని సీఎస్ఐ, యల్లనూరు రోడ్డులోని కల్వారి బెతెస్తా వేరిక చర్చిల్లో క్రైస్తవులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండలవ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని హైస్కూల్ కొట్టాలలో వెలసిన ఎల్‌షద్దాయి చర్చిలో ఫాదర్ ప్రతాప్‌కుమార్ ఏసు ప్రభువు సందేశాన్ని వినిపించారు. మానవుడు ఆడంబరాలకు పోకుండా ఉన్నదానిలోనే సంతృప్తి చెందాలన్నారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏసుక్రీస్తు జీవన విధానంపై విద్యార్థులు చేసిన నాటికలు అలరించాయి. అనంతరం చర్చికి వచ్చిన వారికి పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ ప్రతాప్‌కుమార్, భాస్కర్, కుమార్ స్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని చర్చిలలో సోమవారం క్రిస్మస్ పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. క్రీస్తును ఆరాధించడంలో ఉన్న ఆనందాన్ని ఇతరులకు పంచడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. ఈసందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చర్చీ సభ్యులు వీరయ్య, రవిరాజు, రత్నరాజు, ఆనంద్‌రాజ్, అబ్రహాం, కిష్టఫర్ బాబు, ఇల్లూరు రాజు, ప్రసాద్, రజని, జయామణి, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, మంజుల, శాంతమ్మ, చంద్రకళ, జయమ్మ, మహిమ, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: చుక్కలూరు గ్రామంలో వున్న చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బైబిల్ సారాంశాన్ని వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా ఉన్న 13 ప్రధాన చర్చిల్లో సోమవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వ హించారు. మండల కేంద్రంలో సీఎస్ఐ చర్చి, కమలపాడు రోడ్డులోని అగాపే చర్చి, గుత్తి రోడ్డులో చర్చి, చందన, రాయలచెరువు రైల్వేగేట్, కోనుప్పలపాడు వద్ద ఆయా చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అగాపే చర్చిలోని పాస్టర్ సాల్మోన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, వార్డు మెంబరు తిరుపతి హాజరయ్యారు. క్రైస్తవులకు పాస్టర్లు అన్నదానం ఏర్పాటు చేశారు.

గుంతకల్లు: పట్టణంలో సోమవారం క్రిస్మస్ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎస్ఐ, ఆరోగ్య మాత, ఆర్సీఎం, ఇమ్మానియేల్, ఎస్‌పీజీ తదితర చర్చిల్లో అర్ధరాత్రి నుంచి నిర్వహించిన ప్రార్థనల్లో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు ఏసుక్రీస్తు విశేషాలు చెప్పారు. ఈ సందర్భంగా చర్చిల్లో క్రీస్తు తత్వాన్ని బోధించే ప్రత్యేక గీతాలను ఆలపించారు. శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు చర్చిల్లో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ప్రతి ఒక్కరికీ శాంతీ, సౌభాగ్యం, సంతోషాలు కలగజేయాలని ఆకాంక్షించారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.


పామిడిలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


గుత్తిలోని సీఎస్ఐ టౌన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సాల్మోన్


పెద్దవడుగూరు ఐఎన్ఈసీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా నిర్వహించే క్రిస్మస్ వేడుకలు మండలంలో వివిధ గ్రామాల్లో సోమవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల చర్చిలు విద్యుద్దీపాలంకరణతో ప్రత్యేక శోభ సంతరించుకున్నాయి. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రైస్తవులకు దైవ సందేశాన్ని అందించారు. శాంతికి, ప్రేమకు దయగల ప్రభువు యేసు క్రీస్తని, ఆయన అడుగు జాడల్లో క్రైస్తవులు నడవాలని సూచించారు.

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు, నరసాపురం, పెండేకల్లు, పెద్దయక్కలూరు, ముచ్చుకోట తదిదతర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చీల్లో క్రైస్తవులు పత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు జన్మ విశిష్టతను పాస్టర్లు వివరించారు.


గుత్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


తాడిపత్రిల్లో పాల్గొన్న క్రైసవులు


జీకేఎస్‌లో కేక్ కట్ చేస్తున్న చర్చి ఫాదర్ ప్రతాప్‌కుమార్


అగాపే చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


గుంతకల్లు సీఎస్ఐ చర్చిలో సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్

ప్రభాకరా.. పండుగ వేళా ప్రవర్తన మారదా?

- అలంకరణ పేరుతో వైఎస్సార్‌సీపీ జెండాల తొలగింపు
- అడ్డుకున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తీరు వివాదాలకు దారి తీస్తోంది. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన గురించి పట్టించుకోవడం మాని వైఎస్సార్‌సీపీని లక్ష్యంగా చేసుకుని బురదజల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. నూతన సంవత్సర వేడుకల కోసం విద్యుత్ స్తంభాలను అలంకరించే పేరిట అక్కడక్కడా స్తంభాలకు కట్టిన వైఎస్సార్‌సీపీ జెండాల తొలగింపు చర్యలకు సోమవారం పూనుకున్నారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద జెండాలు తొలగిస్తుండగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి హంగామా చేశాడు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉనికి చాటుకోవడానికి, ఆధిపత్యం చెలాయించడానికి ఆందోళన పేరుతో రెచ్చిపోవడం జేసీకి పరిపాటిగా మారిందని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని, తరచూ ప్రశాంతతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందారు.పండుగ వేళ ఇదేమి లొల్లి అంటూ ఈసడించుకున్నారు.


రోడ్డుపై హంగామా చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజక వర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం వెంకటాపురం గ్రామంలో అంకాలమ్మ గుడి నూతన గోపురం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రోటరీపురం, చెదుల్ల, జన చైతన్యనగర్ కాలనీ, బి.కొత్తపల్లి, పుట్లూరు శింగనమల మండల్లాలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఆలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సొంత నిధులు వెచ్చిస్తున్నారన్నారు. వెంకటాపురం గ్రామంలో గడప గడపకూమన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే ఎదుట అంకాలమ్మ దేవాలయం గుడి గోపురం నిర్మాణానికి సహాయం చేయాలని కోరారన్నారు. దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్పందించి రూ.5 లక్షలు సొంత డబ్బు గోపుర నిర్మాణానికి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కుళ్లాయప్ప, ఎస్సీసెల్ మండల కన్వీనర్ కాటమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరామిరెడ్డి, రఘు, చిన్న నాగముణి, రామచంద్ర, శివ శంకర్, అంజి, పుల్లన్న, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.


గోపుర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

కాపర్ వైరు, ఆయిల్ చోరీ

యాడికి: వ్యవసాయ పొలాల్లో ఉన్న 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను దోచుకెళ్లిన ఘటన మండలంలోని చందన గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు..చందన, రాయలచెరువు రహదారిలో పొలిమేర పెద్దమ్మ గుడి సమీపంలో చందన గ్రామానికి చెందిన దేవరాజు, హనుమప్పనాయుడుకు చెందిన తోటలో గల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సరస్వతీ విద్యామందిరం ఎదురుగా గోపాల్, గంగరాజు, రాయలచెరువుకు చెందిన మరో రైతు రాధాకృష్ణకు తోటలోని మూడు ట్రాన్స్‌ఫార్మను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను తీసుకెళ్లారు. సోమవారం ఉదయం పొలాలకు వచ్చిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

క్రీడా సంగ్రామానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- పోటీలను ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు

శింగనమల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలకు సర్వం సిద్ధమైంది. తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకటరామిరెడ్డి పోటీలను ప్రారంభించనున్నారు. 15 సంవత్సరాలు నిండిన క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు.

55644 మంది నమోదు..

మంగళవారం నుంచి ఫిబ్రవరి 10 వరకూ పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే క్రీడాకారులు ఆయా సచివాలయాల్లో నమోదు చేసుకున్నారు. తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లో మొత్తం 55644 మంది క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈమేరకు ఆయా గ్రామాలు, వార్డుల్లో క్రీడాపోటీల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వం విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేయనుంది.

ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో పాల్గొనే వారి వివరాలు..

మండలం	పేర్లు నమోదు చేసుకున్న వారు
శింగనమల	25,930
గుంతకల్లు	13,364
తాడిపత్రి	16,350


శింగనమలలో పోటీల నిర్వహణకు సిద్ధమైన క్రీడా మైదానం

ప్రతిభ నిరూపించుకుంటా


నేకు వాలీబాల్ అంటే చాలా ఇష్టం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మా ప్రతిభను నిరూపించుకోవడానికి మంచి అవకాశం. ఉపయోగించుకుంటాం.
– కార్తీక్, డిప్లొమా విద్యార్థి, శింగనమల

మంచి అవకాశం


ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు క్రీడాకారుల్లో నైపుణ్యతను వెలికితీయడానికీ ఉపయోగపడతాయి. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్ ఆడడానికీ నమోదు చేసుకున్నాను. ఇలాంటి పోటీలు ఏటా నిర్వహించాలి.
– పవన్, డిగ్రీ విద్యార్థి, బుక్కరాయసముద్రం

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామంలో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, వైస్ ఎంపీపీ సుద్దల తిరుపాలమ్మ చొరవతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.8 లక్షలు మంజూరయ్యాయి. కొత్తూరు బీసీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు సుద్దల రాము యాదవ్, నాయకులు వెంకట్రాముడు యాదవ్, సుధాకర్‌యాదవ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగరంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

బలిజ సంఘం నూతన కమిటీ ఎన్నిక

గుత్తి: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం బలిజ సంఘం నూతన మండలి కమిటీ ఏర్పాటు అయింది. గౌరవాధ్యక్షుడిగా పులికొండ, అధ్యక్షుడిగా బండి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి. సురేష్, గౌరవ సలహాదారులుగా గోరంట్ల నాగయ్య, కపట్రాళ్ల సురేష్, జాయింట్ సెక్రటరీగా నాగేశ్వరరావు, వెంకట నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గార్లదిన్నె: కొప్పలకొండలో సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింగప్ప

గుంతకల్లు రూరల్: కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డీఎస్పీ నరసింగప్ప సిబ్బందికి సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలు ఉపయోగించే మరుగుదొడ్లు, సీజైన వాహనాలను, స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. దొంగతనం కేసుల్లో ముద్దాయిలను త్వరగా పట్టుకొని చోరీ సొమ్మును రికవరీ చేయాలని సూచించారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి రంగనాయకులు, నాయకులు వెంకట్రాముడు యాదవ్, నారాయణ, లింగన్న జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదల హక్కుల కోసం తమ పార్టీ నిర్విరామంగా పోరాడుతోందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరించిందన్నారు. నాయకులు ఉసేన్‌పీరా, రంగస్వామి, శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.